కోహినూర్‌ని కొల్లగొట్టే వీరమల్లు

అగ్రహీరో పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా రానున్న పానిండియా ఫిక్షన్ మూవీ 'హరిహర వీరమల్లు'. ఇందులో పవన్‌కల్యాణ్ రాబిన్‌హుడ్ తరహా పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన కొంత భాగాన్ని దర్శకుడు క్రిష్ తెరకెక్కించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్రానికి దర్శకుడు ఎ.ఎం.జ్యోతికృష్ణ. మెగా సూర్యా ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.ఎం.రత్నం సమర్పణలో, ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని తొలుత మార్చి 28న విడుదల చేయాలని భావించారు. కానీ నిర్మాణానంతర కార్యక్రమాలు మిగిలివున్నందున మే 9న సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ నిర్ణయించారు. ఈ విషయాన్ని శుక్రవారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. మొఘల్ రాజుల నుంచి కోహినూర్ వజ్రాన్ని దొంగిలించి తెచ్చే వీరమల్లుగా మునుపెన్నడూ చూడని కొత్త అవతార్‌లో ఇందులో పవన్‌కల్యాణ్ కనిపిస్తారని, అలాగే ప్రేక్షకుల హృదయాలను కూడా ఆయన దొంగిలిస్తాడని, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేయనున్నామని మేకర్స్ తెలిపారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బాబీ డియోల్ ప్రతినాయకుడు. అనుపమ్‌ఖేర్, జిషు సేన్‌గుప్తా, నాజర్, సునీల్, రాఘుబాబు, సుబ్బరాజు, నోరా ఫతేహి ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, జ్ఞానశేఖర్ వి.ఎస్, సంగీతం: ఎం.ఎం.కీరవాణి.

యుద్ధరంగంలో అర్జున

కల్యాణ్‌రామ్ నటిస్తున్న తాజా చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. విజయశాంతి కీలక పాత్రను పోషిస్తున్నారు. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈ నెల 17న టీజర్‌ను విడుదల చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ప్రీ టీజర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో కల్యాణ్‌రామ్ ఒక పడవపై కూర్చొని, సముద్రం వైపు తదేకంగా చూస్తూ రక్తంతో తడిసిన షర్ట్‌తో యుద్ధానికి సిద్ధమన్నట్లు కనిపిస్తున్నారు. అజనీష్ లోక్‌నాథ్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పవర్‌ఫుల్‌గా ఉంది. యాక్షన్ ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య నడిచే ఎమోషనల్ డ్రామా కథలో కీలకంగా ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. సోహైల్‌ఖాన్, సాయిమంజ్రేకర్, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాణం: అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్, రచన-దర్శకత్వం: ప్రదీప్ చిలుకూరి.

యు.కె.పార్లమెంట్‌లో మెగా సన్మానం

అగ్ర హీరో చిరంజీవి కీర్తి కిరీటంలోకి మరో కలికితురాయి చేరింది. యు.కె.పార్లమెంట్‌లో గౌరవ పురస్కారాన్ని ఆయన అందుకోనున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. నాలుగున్నర దశాబ్దాలుగా సినిమాల ద్వారా కళారంగానికీ, సమాజానికీ సేవలందించినందుకుగాను ఈ పురస్కారం చిరంజీవిని వరించింది. యు.కె.కి చెందిన అధికార లేబర్ పార్టీ పార్లమెంట్ మెంబర్ నవేందు మిశ్రా ఈనెల 19న యు.కె.పార్లమెంట్‌లో చిరంజీవిని సన్మానిస్తారు. సోజన్ జోసెఫ్, బాబ్ బ్లాక్‌మన్ సహా ఇతర పార్లమెంట్ సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. అదే వేదికపై యూకేలో పేరెన్నికగన్న బ్రిడ్జ్ ఇండియా సంస్థ చిరంజీవికి జీవితకాల సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేయనున్నది. బ్రిడ్జ్ ఇండియా సంస్థ అందిస్తున్న తొలి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఇదని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

మెగాస్టార్‌కు ఎంపీ వద్దిరాజు శుభాకాంక్షలు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : యూకే 'లైఫ్ టైం అచీవ్‌మెంట్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ సర్వీస్' అవార్డుకు ఎంపికైన సినీ నటుడు చిరంజీవికి బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శుభాకాంక్షలు తెలిపారు. సినిమా, ప్రజాసేవ, సేవారంగాల్లో విశేషంగా చేసిన సేవలకు గుర్తింపుగా చిరంజీవిని ఈ జీవితకాల సాఫల్య పురస్కారానికి ఎంపిక చేస్తూ అధికార లేబర్ పార్టీకి చెందిన ఎంపీలు నవేందు మిశ్రా, సోజన్ జోసెఫ్, బాబ్ బ్లాక్‌మెన్ ప్రకటించినట్టు పేర్కొన్నారు. ఈ అవార్డును ఈ నెల 19న చిరంజీవి అందుకోనున్నారు.

శ్రీలీల ఔదార్యం

మనిషే కాదు.. శ్రీలీల మనసు కూడా బంగారమే. రెండేళ్ల క్రితం దివ్యాంగులైన ఇద్దరు పిల్లల్ని అనాథాశ్రమం నుంచి దత్తత తీసుకున్నదట శ్రీలీల. వారి భవిష్యత్తుకు అండగా నిలవడమే కాక, వారి ప్రతి విషయాన్నీ దగ్గరుండి మరీ చూసుకుంటున్నదట. గురు, శోభిత ఆ పిల్లల పేర్లు. స్టార్‌డమ్ కారణంగా శ్రీలీల వ్యక్తిగత విషయాలను తెలుసుకోడానికి అభిమానులు ఆసక్తి చూపిస్తున్న నేపథ్యంలో ఈ విషయం వెలుగు చూసింది. నితిన్‌కి జోడీగా ఆమె నటించిన 'రాబిన్‌హుడ్' సినిమా ఈ నెల 28న విడుదల కానుంది. అలాగే.. హీరో కార్తీక్ ఆర్యన్‌తో ఓ బాలీవుడ్ సినిమాలో నటించనున్నది శ్రీలీల. అనురాగ్ బసు దర్శకత్వంలో భూషణ్‌కుమార్ నిర్మిస్తున్న ఈ రొమాంటిక్ చిత్రం.. 'ఆషికీ 3' అని బాలీవుడ్‌లో కథనాలు వెలువడుతున్నాయి. అయితే.. దీనిపై అధికారిక ప్రకటన అయితే రాలేదు.

సంగీత స్రష్ట ఇళయరాజా స్వర ప్రయాణానికి 50ఏండ్లు

నిండాయి. ఈ సందర్భంగా మ్యూజిక్ మ్యాస్ట్రో 50ఏండ్ల స్వరప్రయాణ వేడుకను అధికారికంగా, అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు తమిళనాడు ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ నేపథ్యంలోనే లండన్ పర్యటన ముగించుకొని వచ్చిన ఇళయరాజాను తమిళనాడు సీఎం స్టాలెన్ స్వయంగా కలిసి ఈ విషయాన్ని వెల్లడించారు. తదనంతరం ఆయన తన ఎక్స్(ట్విటర్)లో ఇందుకు సంబంధించిన వీడియోను పోస్ట్ చేశారు. ఇళయరాజా అర్ధశతాబ్దపు సంగీత ప్రయాణ వేడుకలో అభిమానులంతా భాగం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది అందరి వేడుకగా ఆయన అభివర్ణించారు. ఇదిలావుంటే.. తన 'సింఫొని' కార్యక్రమాన్ని నిర్వహించడానికి 13 దేశాలతో ఒప్పందం కుదిరినట్టు ఇళయరాజా తెలియజేశారు. మార్చి 9న లండన్‌లో ఆయన 'సింఫొని' కార్యక్రమం వైభవంగా జరిగింది. త్వరలో దుబాయ్, ప్యారిస్ తదితర చోట్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఇళయరాజా తెలిపారు. తన 'సింఫొని' కార్యక్రమాన్ని దయచేసి ఎవ్వరూ డౌన్‌లోడ్ చేసుకోవద్దని, తనను అభిమానించేవారు ప్రత్యక్షంగా తన 'సింఫొని' సంగీతాన్ని వినాలని ఇళయరాజా విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర వేడుకగా మ్యాస్ట్రో అర్ధశతాబ్దపు సంగీత ప్రయాణ వేడుక

సంగీత స్రష్ట ఇళయరాజా స్వరప్రయాణానికి 50ఏండ్లు

హోలీ సంబరాల ఏటిగట్టు

హీరో సాయిదుర్గతేజ్ నటిస్తున్న యాక్షన్ ప్యాక్డ్ పానిండియా థ్రిల్లర్ 'సంబరాల యేటిగట్టు'(SYG). రోహిత్ కెపి దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని ప్రైమ్‌షో ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్నారు. హోలీ పర్వదినం సందర్భంగా ఈ సినిమాకు చెందిన కొత్త పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. టీమ్ మొత్తం హోలీ సంబరాన్ని జరుపుకుంటూ ఆనందంతో నిడివున్నట్టు ఈ పోస్టర్ చెబుతున్నది. సాయిదుర్గతేజ్ టీమ్‌ను ఉత్సాహపరుస్తూ తన చేతిని పైకెత్తడం ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ప్రస్తుతం హైదరాబాద్‌లో పాట చిత్రీకరణ జరుగుతున్నదని, సెప్టెంబర్ 25న పానిండియా స్థాయిలో సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: వెట్రి పళనిసామి, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్.

25ఏండ్ల కల నెరవేరింది

'90స్ ఏ మిడిల్‌క్లాస్ బయోపిక్' వెబ్‌సిరీస్‌తో నటుడిగా తిరిగి వెలుగులోకి వచ్చారు శివాజీ. శుక్రవారం విడుదలైన 'కోర్ట్: స్టేట్ వర్సెస్ ఏ నోబడీ' చిత్రంలో ఆయన పోషించిన మంగపతి పాత్రకు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. నెగెటివ్ షేడ్స్‌తో కూడిన ఆయన పాత్ర కథలో కీలకంగా నిలిచింది. ప్రియదర్శి ప్రధాన పాత్రలో రామ్ జగదీష్ దర్శకత్వంలో వాల్‌పోస్టర్ పతాకంపై ప్రశాంతి తిపిర్నేని ఈ చిత్రాన్ని నిర్మించారు. 12 ఏళ్ల విరామం తర్వాత 'కోర్ట్' చిత్రంతో సక్సెస్‌ఫుల్ సెకండ్ ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టానని ఆనందం వ్యక్తం చేశారు శివాజీ. ఆయన మాట్లాడుతూ '90స్ వెబ్‌సిరీస్ చేస్తున్న టైమ్‌లోనే నాకు బిగ్‌బాస్ ఆఫర్ వచ్చింది. బిగ్‌బాస్ ద్వారా నా నిజమైన వ్యక్తిత్వమేమిటో ప్రపంచానికి తెలిసింది. 90స్ వెబ్‌సిరీస్ తర్వాత దాదాపు ఎనభై కథలు విన్నా. చాలా వరకు ఫాదర్‌రోల్స్ కావడంతో రిజెక్ట్ చేశా. 'కోర్ట్'లో పోషించిన మంగపతి క్యారెక్టర్ నా 25 ఏళ్ల కల. దానికి మంచి గుర్తింపు రావడం ఆనందంగా ఉంది' అన్నారు. స్క్రిప్ట్ రాసే సమయంలోనే దర్శకుడు మంగపతి పాత్రలో తనను ఊహించుకున్నాడని, నిజ జీవితం నుంచి స్ఫూర్తి పొంది ఆ పాత్రను సృష్టించాడని, దర్శకుడి విజన్ వల్లే తాను మంగపతి పాత్రకు పూర్తి న్యాయం చేశానని శివాజీ తెలిపారు. ఈ సినిమాకు సంబంధించిన ఓ రివ్యూలో 'యానిమల్'లో బాబీ డియోల్ కంటే శివాజీ బాగా చేశాడు' అని రాశారని, ఆ మాట విన్నప్పుడు చాలా హ్యాపీగా ఫీలయ్యానని చెప్పారు. ప్రస్తుతం లయతో కలిసి ఓ సినిమా చేస్తున్నానని, 'దండోరా' అనే సినిమాలో కూడా నటిస్తున్నానని, 90స్‌కి సీక్వెల్ కూడా ఉంటుందని శివాజీ వెల్లడించారు.

వ్యాసరచన తెచ్చిన మార్పు

నటిగా దేశవ్యాప్తంగా చక్కటి గుర్తింపు తెచ్చుకున్న శోభితా ధూళిపాళ్ల.. ఇప్పుడు గృహిణిగా కూడా పదుగురి ప్రశంసలందుకుంటున్నారు. పెళ్లయ్యాక ఆమె కట్టుబొట్టు.. నడవడికపై అందరూ పాజిటీవ్‌గా స్పందిస్తున్నారు. అక్కినేని కోడలంటే ఇలా ఉండాలంటూ అభిమానులు కితాబులిచ్చేస్తున్నారు. ఇదిలావుంటే.. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన స్కూల్‌డేస్ గురించి ఆసక్తికరమైన విశేషాలను వెల్లడించారు శోభిత. స్కూల్‌డేస్‌లో శోభిత ఓ అబ్బాయిని ఇష్టపడ్డారట. కానీ ఆ అబ్బాయి మాత్రం తనవైపు అస్సలు చూసేవాడు కాదట. అతని ప్రవర్తన తనని బాధించేదనీ, ఎలాగైనా అతని చూపు తన వైపు తిప్పుకోవాలని స్కూల్‌లో వ్యాసరచన లాంటి పోటీలపై దృష్టి పెట్టాననీ, అది నేర్చుకునే క్రమంలో తన మెచ్యూరిటీ లెవల్స్ పెరిగాయని, తానే ఆ అబ్బాయిని చూడటం మానేశానని శోభిత వెల్లడించారు. కాలేజ్ రోజుల్లో కూడా తనకు చాలా ప్రపోజల్స్ వచ్చాయట. తాను కూడా కొన్ని ప్రేమలేఖలు రాశారట. ఇలా తన మనసును పరిపూర్ణంగా ఆవిష్కరించారు శోభితా ధూళిపాళ్ల. ప్రస్తుతం ఆమె 'గూఢచారి2'లో నటిస్తున్న విషయం తెలిసిందే.

అరవైఏండ్ల వయసులో అమీర్ ప్రేమాయణం

ప్రేయసిని మీడియాకు పరిచయం చేసిన నటుడు

లేటు వయసులో ఘాటు ప్రేమాయణాలు బాలీవుడ్‌కు కొత్తేం కాదు. వలపు గాలి సోకితే వయసుతో పనేముంది అనుకుంటూ ఎందరో తారలు లేటు వయసులో ప్రేమలో మునిగితేలిన ఉదంతాలున్నాయి. తాజాగా అగ్ర నటుడు అమీర్ ఖాన్ ఆ వరుసలో చేరారు. అరవైఏండ్ల వయసులో ఆయన ప్రేమలో పడ్డారు. గురువారం తన బ్రేబర్త్‌డే పార్టీలో ప్రేయసి గౌరీస్ప్రాట్‌ను మీడియాకు పరిచయం చేశారు. గతకొంతకాలంగా తామిద్దరం డేటింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. 'మేమిద్దరం రిలేషన్‌లో ఉన్నాం. పరస్పర గౌరవం, భద్రతాభావంతో మా బంధం కొనసాగుతున్నది. ఇందులో దాచడానికి ఏమీ లేదు. అందుకే ఈ రోజు మీ ముందుకొచ్చాను' అన్నారు. ప్రియురాలు గౌరీ స్ప్రాట్ గురించి చెబుతూ '25ఏళ్ల క్రితమే తొలిసారి తనను కలిశాను. ఆ తర్వాత టచ్‌లో లేకుండా పోయాము. రెండేళ్ల క్రితమే మేమిద్దరం మళ్లీ కలిశాం. నేను కోరుకునే మనశ్శాంతి, ప్రేమను తాను అందివ్వగలదనే నమ్మకం ఏర్పడింది' అని అమీర్‌ఖాన్ చెప్పుకొచ్చారు. ప్రముఖ స్టైలిస్ట్ రీటా స్ప్రాట్ కుమార్తే గౌరీస్ప్రాట్. ప్రస్తుతం ఆమె బెంగళూరులో నివసిస్తున్నారు. అక్కడ వారి కుటుంబానికి ఓ సెలబ్రిటీ సెలూన్ కూడా ఉంది. భర్త నుంచి విడిపోయిన ఆమె ఒంటరిగా ఉంటున్నారు. గౌరీస్ప్రాట్‌కు ఆరేళ్ల కుమారుడు ఉన్నారు. ఇక అమీర్‌ఖాన్ గతంలో రీనా దత్తా, కిరణ్ రావును పెళ్లాడారు. ఇద్దరికీ విడాలకులిచ్చారు. ఆయనకు ముగ్గురు పిల్లలున్న విషయం తెలిసిందే.

ముక్కోణపు ప్రేమకథ

సిద్ధు జొన్నలగడ్డ, రాశీఖన్నా, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'తెలుసు కదా'. స్టైలిస్ట్ నీరజా కోన దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు. శుక్రవారం హోలీ సందర్భంగా కలర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో నాయకానాయికలు సిద్ధు, రాశీఖన్నా, శ్రీనిధి పండగను సెలబ్రేట్ చేసుకుంటూ ఉల్లాసంగా కనిపిస్తున్నారు. 'ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. ఆద్యంతం ఆహ్లాదభరితంగా సాగుతుంది. హృదయాన్ని స్పృశించే సున్నితమైన భావోద్వేగాలతో మెప్పిస్తుంది. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది' చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, రచన-దర్శకత్వం: నీరజా కోన.